క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాండూరు టౌన్: విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పాత తాండూరు, పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని డీఈ భానుప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

రైల్వే బ్రిడ్జిని విస్తరించండి..



ముబారక్‌పూర్ అండర్ రైల్వే బ్రిడ్జి

నవాబుపేట: చిన్నగా ఉన్న రైల్వే వంతెనను విస్తరింపజేయాలని ప్రజలు కోరుతున్నారు. మండల పరిధి ముబారక్‌పూర్ గ్రామం మధ్యలోంచి రైల్వే లైను ఉంది. లైనుకు ఇరువైపులా నివాసాలు ఉన్నాయి. రాకపోకలు సాగించడానికి ఉన్న బ్రిడ్జి వెడల్పు తక్కువగా ఉండటంతో ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. వెడల్పు తక్కువగా ఉండటంతో ఎడ్లబండి, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ తప్పితే.. పెద్ద వాహనాలు రాకపోకలు సాగించే వీలు లేదని తెలిపారు. ఎవరైనా కొత్తగా ఇంటిని నిర్మించుకోవాలంటే నిర్మాణ సామగ్రి రవాణాకు భారీ వాహనాలే అవసరమని పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి, వంతెనను విస్తరింపచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక సహాయం



వెంకటయ్య కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న పాత్రికేయులు

కొడంగల్: ఇటీవల గుండెపోటుతో చనిపోయిన పాత్రికేయుడు వెంకటయ్య కుటుంబానికి శుక్రవారం కొడంగల్ ప్రెస్‌క్లబ్, బొంరాస్‌పేట జర్నలిస్టులు ఆర్థిక సాయం చేశారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకిషన్‌రావ్ ఆధ్వర్యంలో రూ.21 వేలు, బొంరాస్‌పేట పాత్రికేయులు రూ.15 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పత్రిక యాజమాన్యం నుంచి రావాల్సిన బీమా డబ్బులను ఇప్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఇందులో పాత్రికేయులు ఏవీ పృథ్విరాజ్, కానుకుర్తి రమేష్, అనంత ప్రసాద్, కత్తి ప్రభాకర్, పకీరప్ప, నర్సింలు, శ్రీకాంత్, నరేష్, గోపాల్, ఆనంద్, రాఘవేందర్ పాల్గొన్నారు.

3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

తాండూరు రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు 3వ తేదీ నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. మొత్తం 1100 వందల మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఎంఈఓ తెలిపారు.

కొనసాగుతున్న ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్: భక్తుల కొంగు బంగారం కోట్లాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. రెండో రోజైన శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక బోనంతో మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి బోనం సమర్పించారు. నెల రోజుల పాటు జాతర కొనసాగనున్న నేపథ్యంలో నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

నిషేధిత గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు



పాన్‌షాపులో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

పరిగి: నిషేధిత గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పలు పాన్‌షాపులు, కిరాణా దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. అఫ్జల్ గంజ్ పాన్ దుకాణంలో గుట్కా ప్యాకెట్లు లభ్యం కాగా.. దుకాణ నిర్వాహకుడు నర్సింలుపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడారు. నిషేధిత గుట్కా, పాన్ మసాలను ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కనుల పండువగా.. ఈదమ్మ జాతర



జల్దిబిందెను తీసుకువస్తున్న నిర్వాహకులు

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

దౌల్తాబాద్: ఈదమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో వేపచెట్టు కింద వెలసిన అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జల్దిబిందె కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని స్థానిక నాయకులు మోహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, వీరన్న, వెంకట్‌రావు, రమేష్, దస్తప్ప, వెంకటప్ప, మల్కప్ప తదితరులు దర్శించుకున్నారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వంతెనకు మోక్షం కలిగేనా?



దారునివాగుతండా ప్రవాహంతో నిలిచిన రాకపోకలు (ఫైల్)

దారుణివాగుతండా పారిందంటే రాకపోకలు బంద్

- ఏటా ఇబ్బంది పడుతున్న గిరిజనులు
- బ్రిడ్జి మంజూరుకు దశాబ్దకాలంగా ఎదురుచూపులు

పెద్దేముల్: మోస్తరు వర్షం కురిసి, చిన్నగా దారుణి వాగులో వరద పారినా.. దారుణివాగు తండా వాసుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. తండా వాసులే కాదు.. తాండూరు, పెద్దేముల్ మండల పరిధి గ్రామాలకు వచ్చిపోయేందుకు ఇదే అనువైన దారి కావడంతో ఇరుమండలాల ప్రజలు వానాకాలంలో ఇబ్బంది పడుతుంటారు. వరదలు తగ్గేవరకు తంటాలు పడుతూనే ఉంటారు. ఏటేటా ఇదే ఇబ్బంది ఎదురవుతూనే ఉంటుంది. ప్రస్తుతం వానాకాలం రావడంతో ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు మొదలయ్యాయంటే.. ఊరుదాటని పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. వంతెన నిర్మించాలని పదేళ్లుగా పాలకులకు విన్నవిస్తూనే ఉన్నామని, అయినా ఎవరూ స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

దూరభారం పెరిగి..

వర్షం వస్తే వాగు దాటనీయదని, మండల కేంద్రానికి వెళ్లాలంటే పది కిలో మీటర్లకు బదులు తాండూరు నుంచి 30 కిల్లో మీటర్ల దూరం పయనించి వెళ్లాల్సి ఉంటుందని తండా వాసులు పేర్కొంటున్నారు. అనుబంధ తండాలను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండల ప్రజలు తాండూరు మండలం జినోగుర్తి, కరన్‌కోటకు వెళ్లాలన్నా.. తాండూరు మండల ప్రజలు పెద్దేముల్, ఇందూరు, కోటపల్లి రావాలన్నా ఇదే మార్గం వారికి అనుకూలం అని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించి, బ్రిడ్జి మంజూరు చేసి, రవాణా కష్టాలను తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

బ్రిడ్జి మంజూరు చేయండి



దారునివాగుతండాకు వంతెన మంజూరు చేయాలి. ఇదే విషయాన్ని గతంలో మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి, నాటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విన్నవించాం. అయినా ఫలితం లేదు. వానాకాలం వచ్చిందంటే గిరిజనుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

– లోంక నీలు, ఎంపీటీసీ హన్మాపూర్

గాలిదుమారం.. ఆగమాగం

తెగిపడుతున్న విద్యుత్ తీగలు

- సరఫరాలో తరచూ అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



రోడ్డుపై విరిగి పడిన విద్యుత్ స్తంభాన్ని తొలగించేందుకు శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బంది

ధారూరు: తరచూ వీస్తున్న ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి, నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని మండల ప్రజలు తెలిపారు. గాలి దుమారంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగటం, తీగలు తెగిపడటం భయాందోళన కలిగిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. తరచూ ఇలా జరుగుతుండటంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. తద్వారా విద్యుత్ అంతరాయం కలుగుతుండగా.. పునరుద్ధరించడంలో ట్రాన్స్‌కో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసినా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. మొన్నటి పెను గాలులు మండలాన్ని ఆగమాగం చేశాయని, నానా బీభత్సం సృష్టించాయని వాపోయారు. రోడ్లు, పొలాల మధ్య ఇలా ఎక్కడ చూసినా నేల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు నేటికీ దర్శనమిస్తున్నాయన్నారు. వ్యవసాయ కనెక్షన్లు కట్ చేసి, నివాసాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదన్నారు. వారి నిర్లక్ష్యం వలన రోజుల తరబడి చీకట్లో మగ్గుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, నిలకడగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆదర్శ' పనులను పూర్తిచేయండి

- బడిబాటను విజయవంతం చేయండి
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి
- హెచ్‌ఎంలకు మండల ప్రత్యేక అధికారుల సూచన



పెద్దేముల్: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి జ్యోతి పద్మ

దోమ: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్ బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంఈఓ హరిశ్చందర్, ఏపీఎం సురేశ్, ప్రత్యేక అధికారి హన్మంతురావుతో కలిసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ చైర్మన్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తరగతి గదుల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలని సూచించారు. మేజర్, మైనర్ మరమ్మతు పనులతో పాటు వాటర్ సంపులు, టాయిలెట్లు త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు బడిబాట కార్యక్రమాలను విజయవంతం చేస్తూ బడి బయట పిల్లలను బడిలో చేర్పించి, విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు.

కొడంగల్‌లో..

కొడంగల్: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని తాండూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్‌రావ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధి ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభం అవుతుందని, బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈఓ రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

యాలాలలో..

యాలాల: 3వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బడిబయట పిల్లలు, డ్రాప్ అవుట్, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేక అధికారి జ్యోతి పద్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎం, ఐకేపీ సీసీలు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని, ఇంటింటికీ తిరిగి పిల్లలను సర్కారు బడిలో చేర్పించి సంఖ్యను పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జర్నప్ప, సీడీపీఓ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్లు రాణి, మీనాక్షి, నోడల్ ఆఫీసర్ నర్సింగ్ రావు పాల్గొన్నారు.

ఆలయ మేనేజర్‌కు వీడ్కోలు

కొడంగల్: పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ మేనేజర్ ఆవుల బాల్‌రాజ్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు, కొడంగల్ మండలం వీరశైవ సమాజం సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలదండలతో సత్కరించారు. అనంతరం బాల్‌రాజ్ చేసిన సేవలను కొనియాడారు. సత్కరించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తా, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్.బస్వరాజ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో నందారం శ్రీనివాస్, బాలప్రకాశ్, గడ్డం చంద్రశేఖర్, బస్వరాజ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి కూలీల ఆసక్తి



ఆలేడ్ చెరువులో కంపచెట్లను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

- జోరుగా కొనసాగుతున్న పనులు
- బాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ లభిస్తున్న ఉపాధి

దుద్యాల్: జాతీయ ఉపాధిహామీ పనులు మండలంలో జోరుగా కొనసాగుతున్నాయి. పని గంటలు తక్కువగా ఉండి, ఆకట్టుకునే విధంగా కూలి చెల్లిస్తుండటంతో ఉపాధి పనులకు అర్హులు మక్కువ చూపుతున్నారు. జాబు కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి లభిస్తుండటంతో పల్లెప్రజలు కూలీ పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేకపోయినా.. కూలీలందరికీ చేతినిండా పని దొరుకుతోంది. చెరువుల్లో ఒండ్రు తీయడం, చెరువు కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం, చెట్లను తొలగించడం ఉపాధి సిబ్బంది చూపిన తదితర పనులను చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఉన్న ఊర్లో ఉండి ఉపాధి పొందడం సంతోషంగా ఉందని పలువురు కూలీలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. రోజువారి కూలీకూడా రూ.272 నుంచి 300 ప్రభుత్వం పెంచిందని పేర్కొంటున్నారు. పనులు చేసిన వెంటనే బిల్లులు కూడా వస్తున్నాయని, పని ప్రదేశంలోనూ సౌకర్యాలు సంబంధిత అధికారులు కల్పిస్తున్నారని వెల్లడించారు.

సంక్షిప్త వార్తలు

• ఇన్‌చార్జి ఎంపీడీఓగా వెంకన్‌గౌడ్



బొంరాస్‌పేట: మడల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకన్‌గౌడ్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగిస్తూ.. ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా ఉన్న శ్రీదేవి ఉద్యోగ విరమణ పొందారు.

• దుండగులను అరెస్ట్ చేయండి

పరిగి: దళితులపై దాడులకు పాల్పడిన దుండగులను అరెస్టు చేయాలని దళితసంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధి రుక్కుంపల్లి గ్రామానికి చెందిన హరిజన మొగులయ్యపై ఇటీవల పోచమ్మ బోనాల పండుగలో అగ్రకులానికి చెందిన పలువురు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినా.. వారిని అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకోవాలని, లేని యెడలా దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఇందులో దళితసంఘ నాయకులు వెంకయ్య, రమేష్, విజయ్, శివ, శేఖర్ తదితరులు ఉన్నారు.

• విద్యుత్ అంతరాయం నేడు

బొంరాస్‌పేట: బురాన్‌పూర్ 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండల పరిధి గ్రామాలకు, తండాలకు శనివారం విద్యుత్ అంతరాయం కలగనుందని ఏఈ నాగరాజు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు సాలిండాపూర్ ఫీడర్ పరిధి సాలిండాపూర్, గట్టిగానితండా, మాలకుంటతండా, నర్స్యానాయక్‌తండా, దరికిందితండా, కుబ్యానాయక్‌తండా, భోజన్నగడ్డతండా, 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మదన్‌పల్లి ఫీడర్ పరిధి మదన్‌పల్లి, మదన్‌పల్లితండాకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

• పొగాకుకు దూరంగా ఉందాం

కుల్కచర్ల: పొగ తాగడం, పొగాకు తినడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యురాలు మాధురి అన్నారు. పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ఆసుపత్రికి వచ్చిన వారికి పొగాకు తీసుకోవడం వలన జరిగే నష్టం గురించి వివరించారు. పొగాకు క్యాన్సర్‌కు దారితీస్తుందని, దానికి దూరంగా ఉండాలని సూచించారు. ఇందులో వైద్య సిబ్బంది మౌనిక, నవీన్, యాదమ్మ ఉన్నారు.

• ఫౌండేషన్ సేవలు అభినందనీయం

యాలాల: వేసవిలో ప్రత్యేక శిబిరం నిర్వహించి, పలు రకాల సేలు చేపట్టడం అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ శిక్షణ ఫౌండేషన్ శిబిరం సేవలను కొనియాడారు. శుక్రవారం అచ్యుతాపూర్ ప్రాథమిక పాఠశాలలో శిబిరం ముగింపులో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, పద్యాలు, ముగ్గులు, ఆటల పోటీలు పెట్టినట్లు తెలిపారు. వీటితో పాటు తరగతులకనుగుణంగా కూడికలు, తీసివేతలు, భాగహారం నేర్పినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

- డీలర్లకు వ్యవసాయ అధికారుల ఆదేశం
- గుర్తింపు పొందిన దుకాణాల్లోనే ఖరీదు చేయండి
- నాసిరకం విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి
- అవగాహన కార్యక్రమంలో రైతులకు సూచన



దుద్యాల్: అల్లిఖాన్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ మునీరొద్దీన్



అనంతగిరి: డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ స్వరూప

పెద్దేముల్: నకిలీ విత్తనాలు విక్రయించి మోసపోవద్దని వ్యవసాయ శాఖ తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిధి బండపల్లి గ్రామంలో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖ నుంచి గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు ఖరీదు చేసి, డీలర్ సంతకంతో కూడిన రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వ్యాపారులు రసీదు ఇవ్వకపోతే వ్యవసాయ కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విడిగా విత్తనాలు కొనడం మంచిది కాదని, కంపెనీ లేబుల్ ఉండి, గడువు తేదీ ఉన్న ప్యాకెట్లనే కొనాలని వివరించారు. రసీదు, విత్తన ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యేనాటికి భద్రపర్చాలని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఏఈఓ వినయ్, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నకిలీ విత్తనాలను విక్రయించవద్దని వ్యాపారులను ఏడీఏ రుద్రమూర్తి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు విక్రయించిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వాలని సూచించారు.

నాసిరకం విత్తనాలతో నష్టపోవద్దు

దుద్యాల్: తక్కువ ధరకు లభిస్తున్నాయని నాసిరకం విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోవద్దని వ్యవసాయ విస్తరణ అధికారులు మునీరొద్దీన్, రేణుకలు రైతులకు సూచించారు. మండల పరిధి అల్లిఖాన్‌పల్లి, గౌరారం, చౌందర్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వ్యవసాయ శాఖ నుంచి గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలను కొనుగోలు చేయాలని చెప్పారు. అనంతరం డీలర్ సంతకంతో కూడిన రసీదును పొందాలన్నారు. విత్తన ప్యాకెట్, రసీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చాలని తెలిపారు.

నకిలీలను అరికడదాం

అనంతగిరి: సమష్టిగా పనిచేసి నకిలీ విత్తనాలను అరికడదామని ఏడీఏ స్వరూప అన్నారు. వికారాబాద్ మండల పరిధి నారాయణపూర్ రైతు వేదికలో ఏడీఏ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వం అనుమతించిన విత్తనాలనే విక్రయించాలని తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులను విక్రయించిన వెంటనే రసీదు ఇవ్వాలని సూచించారు. పత్తి ప్యాకెట్లు కొనుగోలు చేసిన వారి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఏఓలు, క్లస్టర్ ఏఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పరిగి: విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ లక్ష్మీకుమారి సూచించారు. మండల పరిధి మాధారం తదితర గ్రామాల్లో విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు గుర్తింపు పొందిన దుకాణం నుంచే కొనుగోలు చేయాలని చెప్పారు. అనంతరం రసీదు తీసుకోవాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఇందులో ఏఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైలు పాలు కావద్దు

పూడూరు: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మి జైలు పాలు కావద్దని ఏడీఏ లక్ష్మీకుమారి అన్నారు. మండల కేంద్రం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో విత్తన డీలర్లతో ఆమె మాట్లాడారు. నాసిరకం, లేబుల్ లేని విత్తనాలు విక్రయించడం చట్టరీత్యా నేరమని, వాటిని అమ్ముతూ పట్టుబడితే పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని, అవసరమైతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు అడిగిన రకం విత్తనాలను ఇవ్వాలని డీలర్లకు సూచించారు. చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ డీలర్లు కచ్చితంగా స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్‌లను ప్రతి రోజు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ తులసీరాం, ఏఈఓలు శిరీష, వర్ష, రాంబాబు, ఇలియాస్, గీత తదితరులు పాల్గొన్నారు.